మహిషాసురమర్ధినిగా అమ్మవారు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 11 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో దుర్గాష్టమి పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ప్రాతఃకాల పూజ, స్థాపిత దేవతా హవనం, అర్చనలు, పారాయణాలు, గాయత్రీ జపం, లలిత సహస్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం పూజ నీరాజన మంత్రపుష్పాలు చేపట్టారు. సాయంత్రం దేవి చతుషష్టి ఉపచార పూజ, సహస్రనామార్చన, నీరాజనం, మంత్ర పుష్పాలు, సువాసినీ పూజలు చేపట్టి తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. పర్వతవర్ధినీ అమ్మవారు మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తిభావం అలవర్చుకోవాలి : ప్రభుత్వ విప్ బీర్ల

ఆత్మకూరు(ఎం) : రహీంఖాన్‌పేటలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు టౌన్, అక్టోబర్ 11 : ప్రజలందరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీలోని భరత్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం ఆయన పూజలు చేసి మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలు పాడిపంటలతో, సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఐలయ్యను సత్కరించారు. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం దుర్గామాత అమ్మవారు మహిషాసురమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మార్కండేయ కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గామాతను ఉత్సవ కమిటీ సభ్యులు మహిషాసురమర్ధినిగా అలంకరించి పూజలు చేశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఆత్మకూరు(ఎం) : మండలంలోని రహీంఖాన్‌పేటలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజలందరూ పార్టీలకతీతంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, నాయకులు సిద్ధులు, శ్రీశైలం, స్వామి పాల్గొన్నారు.

నగర సంకీర్తన

నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

చౌటుప్పల్, అక్టోబర్ 11 : పట్టణంలో ఆధ్యాత్మిక కార్యక్రమం నగర సంకీర్తన శుక్రవారం రెండో రోజు కొనసాగింది. దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని భావనారుషి కళానికేతన్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన ద్వారా దసరా పండుగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో భావనారుషి కళానికేతన్ అధ్యక్షుడు బడుగు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి పోలోజు రాజుచారి, సభ్యులు పోలోజు వెంకటాచారి, దోర్నాల శంకరయ్య పాల్గొన్నారు.

మహిళ లకు చీరెలు పంపిణీ

ఆత్మకూరు(ఎం) : పల్లెపహాడ్‌లో మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 11 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పల్లెపహాడ్‌లో మహిళలకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, ధనలక్ష్మి దంపతులు సొంతంగా కొనుగోలు చేసిన చీరెలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు చీరెలు పంపిణీ చేసి గౌరవించిందన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం చీరెలకు బదులుగా రూ.500 ఇస్తామని బూటకపు వాగ్దానాలు చేసి అమలు చేయకుండా మహిళలను అగౌరవపరిచిందని విమర్శించారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాలె మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి శంకర్, మాజీ ఎంపీటీసీ పరశురాములు, నాయకులు బీరయ్య, పెంటయ్య, వెంకట్ రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరెల పంపిణీ

చౌటుప్పల్ రూరల్ : మున్సిపాలిటీలోని 40 మంది మహిళా కార్మికులకు జేజేఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో శుక్రవారం చీరెలు పంపిణీ చేశారు. నిత్యం పట్టణ వీధులను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడే పారిశుధ్య కార్మికులకు దసరా సందర్భంగా చీరెలు అందజేయడం సంతోషంగా ఉందని ఫౌండేషన్ చైర్మన్ జొర్రిగల జ్ఞానేశ్వర్ అన్నారు. ఫౌండేషన్ సభ్యులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి బట్టలు అందజేత

గ్రామ పంచాయతీ సిబ్బందికి బట్టలు అందజేస్తున్న లక్ష్మణ్

రాజాపేట, అక్టోబర్ 11 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు గొటె లక్ష్మణ్ శుక్రవారం బట్టలు, చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆడెపు ఈశ్వరమ్మాశ్రీశైలం, నాయకులు పూస రాజు, గొటె కృష్ణ, సతీశ్‌గౌడ్, అరుణ్, శివ, వంశీ, సాయి పాల్గొన్నారు.

వాటర్ క్యాన్ల పంపిణీ

వార్డు ప్రజలకు క్యాన్లు పంపిణీ చేస్తున్న ధర్మరాజు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 11 : పట్టణంలోని 2వ వార్డు ప్రజలకు మత్స్యకారుల సంఘం జిల్లా చైర్మన్ సామల ధర్మరాజు శుక్రవారం తన సొంత ఖర్చుతో మంచినీటి క్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడుతానన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వార్డు అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. వార్డు ప్రజలు సామాజిక సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వార్డు ప్రజలు ఎర్ర ఆంజనేయులు, నర్సింహ, జహంగీర్, రాంచందర్, అంజయ్య, రాములు, ముబీన్, శ్రీనాథ్, లతీఫ్, నగేశ్, విజయ్‌కుమార్, కార్తీక్, అజయ్, మధు, సత్యనారాయణ, సాగర్ పాల్గొన్నారు.

రాజాపేట పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ

పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహిస్తున్న పూజారి

రాజాపేట, అక్టోబర్ 11 : దసరా సందర్భంగా శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో శివాలయం పూజారి చంద్రశేఖర్ పంతులు ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పోలీస్ సిబ్బందిని పూజారి సత్కరించి ఆశీర్వదించారు. ఏఎస్ఐలు ప్రకాశ్‌నాయుడు, చంద్రయ్య, హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో సుప్రభాత సేవ



ఊంజల్ సేవలో భాగంగా అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 11 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల సుప్రభాత సేవోత్సవాన్ని అర్చకులు అత్యంత వైభవంగా జరిపారు. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు 'కౌసల్యా సుప్రజా రామపూర్వ సంధ్యా ప్రవర్తతే' అంటూ స్నాన సుప్రభాతాన్ని ఆలకించి స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాల పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్య కల్యాణ తంతును నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.14,73,104 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

సోమనాథ క్షేత్రంలో చండీయాగం

• మహిషాసురమర్ధిని అవతారంలో దుర్గామాత

చౌటుప్పల్‌లో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

చౌటుప్పల్ : సోమనాథ క్షేత్రంలో చండీ యాగం నిర్వహిస్తున్న భక్తులు

చౌటుప్పల్, అక్టోబర్ 11 : పట్టణంలోని శివభక్త మార్కండేయస్వామి దేవాలయంలో శుక్రవారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. సోమనాథ క్షేత్రంలో చండీ యాగం చేపట్టారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, క్షేత్రం అధ్యక్షుడు బడుగు నర్సింహ, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు గోశిక నర్సింహ, ఉపాధ్యక్షుడు గంజి వెంకటేశం, నాయకులు మొగుదాల రమేశ్ గౌడ్, మంచికంటి భాస్కర్, బాలరాజు, జయప్రకాశ్ పాల్గొన్నారు.

దుర్గామాతకు కుంకుమార్చన

మోత్కూరులో కుంకుమార్చనలో మహిళలు

మోత్కూరు : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద శుక్రవారం కుంకుమార్చన నిర్వహించారు. మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో బస్టాండ్ వద్ద గణేశ్ యూత్ ఆధ్వర్యంలో, రెండో వార్డులోని విగ్నేశ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మోత్కూరి బహ్మచారి, బయ్యని రాజు, బైరు యాకేశ్, బత్తుల అవిలయ్య, నరేశ్ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయం వద్ద హోమం

ఆత్మకూరు(ఎం) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ దేవాలయం ఎదుట హోమం నిర్వహించారు. మండలంలోని రహీంఖాన్‌పేటలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద పూజలు చేశారు. ఆలయ నిర్మాణదాతలు సురేందర్ రెడ్డి, సునంద, పూర్ణచందర్‌రాజు, ధనలక్ష్మి, మహేశ్, లక్ష్మయ్య, శిరీష, అర్చకులు కార్తీక్, కిరణ్‌కుమారాచార్యులు, కరుణాకర్‌చార్యులు పాల్గొన్నారు.

మహిషాసురమర్ధిని రూపంలో..

బొమ్మలరామారం : మండల కేంద్రంలో శివ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం దుర్గాదేవిని మహిశాసురమర్ధిని రూపంలో అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కట్ట శ్రీకాంత్ గౌడ్, సభ్యులు పండుగ కుమార్, మహేశ్ గౌడ్, శాంతాచారి పాల్గొన్నారు.

బొమ్మలరామారం : దుర్గాదేవి మండపం వద్ద భక్తుల పూజలు

ఆత్మకూరు(ఎం) : కనకదుర్గమ్మ ఆలయం వద్ద హోమం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 11 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మున్సిపాలిటీలోని హనుమాన్‌వాడకు చెందిన చేనేత కార్మికుడు కుడికాల వెంకటేశం (55) శుక్రవారం మృతి చెందాడు. వెంకటేశం బుధవారం భువనగిరి నుంచి పోచంపల్లికి స్కూటీపై వెళ్తుండగా, మార్గమధ్యలో ముక్తాపూర్ రైస్‌మిల్లు సమీపంలో గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు కుడికాల శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకటేశం మృతికి పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, స్నేహితులు సంతాపం తెలిపారు.

ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు

బీబీనగర్, అక్టోబర్ 11 : మండలంలోని వెంకిర్యాల గ్రామంలో గల అతి పురాతన లక్ష్మీనారాయణస్వామి దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి జి.నరేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30లోపు ఉమ్మడి నల్లగొండ జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చేనేత కార్మికులకు త్రిప్టు ఫండ్ అందజేత

చేనేత కార్మికులకు త్రిప్టు ఫండ్ పొదుపు పథకం చెక్కులను అందజేస్తున్న ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీలత

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 11 : చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన త్రిప్టు ఫండ్ పథకం చెక్కులను ఎన్‌డీసీసీ బ్యాంకు చౌటుప్పల్ బ్రాంచి మేనేజర్ శ్రీలత శుక్రవారం కార్మికులకు అందజేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిప్టు ఫండ్ పథకాన్ని కొనసాగించాలని ఈ సందర్భంగా కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు కర్నాటి జనార్దన్, కందగట్ల కిషన్, సుంకి రవికుమార్, అందె నర్సింహ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కేహెచ్ఆర్ ఫౌండేషన్

కేహెచ్ఆర్ ఫౌండేషన్ అందజేసిన ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు (ఫైల్)

హరిదీప్‌రెడ్డి, కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 11 : మండలంలోని సింగారం గ్రామానికి చెందిన కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్‌రెడ్డి చిన్నతనంలోనే హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో స్థిరపడ్డారు. కష్టపడి ఉన్నత చదువులు చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా వ్యాపారంలో అడుగుపెట్టి ఉన్నత స్థాయికి ఎదిగారు. సంపాదించిన దాంట్లో నిరుపేదలకు సాయం చేసి ఆదుకోవాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆత్మకూరు(ఎం) మండలంలో మృతి చెందిన నిరుపేద కుటుంబాలకు, అనారోగ్యంతో దవాఖానల్లో చికిత్స పొందుతున్న 25మందికి రూ.3లక్షల వరకు ఆర్థిక సహకారం అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకుడి మండపాలకు రూ.50లక్షలు విలువ గల సౌండ్‌బాక్స్‌లను అందజేసి యువకుల్లో ఉత్సాహాన్ని నింపారు. సంపాదించిన దాంట్లో నిరుపేద కుటుంబాలకు తోచిన సహకారం అందించడం చాలా ఆనందంగా ఉన్నదని కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి తెలిపారు. పేద కుటుంబాలను ఆదుకోవడంలో ముందుంటామని, ఫౌండేషన్ సేవలను మరింత విస్తరింపజేస్తామని ఆయన చెప్పారు.

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

• కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి భూ నిర్వాసితుల వినతి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భూ నిర్వాసితులు

చౌటుప్పల్, అక్టోబర్ 11 : చౌటుప్పల్ – రాయగిరి – గజ్వేల్ తదితర ప్రాంతాల ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని భూ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డికి ఆయా ప్రాంతాల భూ నిర్వాసితులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏండ్ల తరబడి వ్యవసాయం నమ్ముకొని జీవిస్తున్న తమ భూములు కోల్పోతే రోడ్డున పడుతామన్నారు. అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేయాలని మంత్రిని కోరారు. సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి చెప్పినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, రైతు సంఘాల నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, రామలింగం గౌడ్, జాల శ్రీశైలం యాదవ్, దబ్బేటి రాములు గౌడ్, గోపగోని లక్ష్మణ్‌గౌడ్, సందగళ్ల మల్లేశ్ గౌడ్, బొమ్మిరెడ్డి ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రమణేశ్వరంలో శ్రీచక్రాల ప్రతిష్ఠోత్సవం

రమణేశ్వరంలో శ్రీచక్రాల ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 11 : దుర్గాదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో నిర్వహిస్తున్న శ్రీచక్రాల ప్రతిష్ఠామహోత్సవం శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా సిద్ధగురువు రమణానందమహర్షి చేతులమీదుగా శ్రీచక్రాల ప్రతిష్ఠను కన్నుల పండువగా వేలాది మంది భక్తుల నడుమ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీచక్రాల స్థాపనతో సకల శుభాలు కలుగుతాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రమణేశ్వర క్షేత్రంలో 1,023 శ్రీచక్రాల స్థాపన చేపట్టామని తెలిపారు. 9అడుగుల పంచలోహ శ్రీచక్రాన్ని మొట్టమొదటిసారిగా ప్రతిష్ఠించామన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ, అన్నదానం చేశారు.

విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వ విప్ రూ.4లక్షల సాయం

భూదాన్ పోచంపల్లి : ప్రశాంత్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 11 : భువనగిరి బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఇటీవల మృతి చెందిన మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి చిన్న లచ్చి ప్రశాంత్ కుటుంబానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రూ.4లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్ శుక్రవారం విద్యార్థి కుటుంబానికి ఆ డబ్బును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఐలయ్య మృతుడి కుటుంబానికి ఇచ్చిన మాటను నెరవేర్చారన్నారు. ఆ కుటుంబంలో ఒకరికి ప్రైవేటు సంస్థలో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, నాయకులు అంజయ్య, శ్రీనివాస్, లింగస్వామి, జంగయ్య, శ్రీశైలం, ఈదయ్య, వెంకటయ్య, శంకర్, నర్సింహ పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి..

ఇటీవల మృతిచెందిన మున్సిపాలిటీ పరిధిలోని గీత కార్మికుడు తంతరపల్లి ఈశ్వరయ్య కుటుంబానికి కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గునిగంటి మల్లేశంగౌడ్, జిల్లా కార్యదర్శి కొయ్యడ నర్సింహ, పట్టణ కార్యదర్శి మక్తల పోచయ్య, నాయకులు వెంకటేశం, సత్యనారాయణ, బసవయ్య, అంజయ్య, బాలయ్య, యాదగిరి, మల్లేశం, పాండు, కిరణ్, కిష్టయ్య, రమేశ్, యాదగిరి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కూరెళ్లలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోరుకొప్పుల సత్తయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సత్తయ్య పార్థివదేహంపై స్థానిక నాయకులు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు. గ్రామ మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, అశోక్, నాయకులు యాదిరెడ్డి, రమేశ్, గణేశ్, శంకరయ్య, నర్సింహ పాల్గొన్నారు.

కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

మండలంలోని టి.రేపాక గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన చింతల ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబానికి కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి అందజేసిన రూ.5వేలను బీఆర్ఎస్ స్థానిక నాయకులు అందజేసి సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు యాస అంజిరెడ్డి, నాయకులు నర్సయ్య, రాములు, మత్స్యగిరి, నర్సిరెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

సీఐ సోలోమాన్‌రాజ్‌కు సన్మానం

సీఐ సోలోమాన్‌రాజ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 11 : సీఐగా బాధ్యతలు చేపట్టిన సోలోమాన్‌రాజ్‌ను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది రమేశ్‌గౌడ్, మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, రామలింగేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ ఐలయ్యగౌడ్, నాయకులు సత్తయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ ఫోరం మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా చాంద్

రామన్నపేట, అక్టోబర్ 11 : తెలంగాణ ఉద్యమ ఫోరం మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మలి దశ ఉద్యమ నేత షేక్ చాంద్‌ను నియమించారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ నాయకులను సమీకరించి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలయ్యే విధంగా పోరాటం చేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన శ్రీనివాస్‌కు, ఉద్యమ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్, ఆయిల్ చోరీ

వలిగొండ, అక్టోబర్ 11 : మండలంలోని ఎదుళ్లగూడెం గ్రామ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్, ఆయిల్ చోరీకి గురైంది. ఎదుళ్లగూడెం నుంచి చైతన్యపురికి వెళ్లే రోడ్డు